ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 115 | పేజీలు: 6 | వెల: రూ.3/- | మంగళవారం 4 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# కుంభవృష్టి వర్షాలు ప్రాణనష్టం తప్పదు

**అమ్మవారికి కోపం వచ్చింది .. కొంతమంది కళ్ళు నెత్తికెక్కి ప్రవర్తిస్తున్నారు**

**వావి వరసలు లేకుండా ఘోరాలు జరుగుతున్నాయి .. వారిని నా పాదాల కింద నలిపేస్తాను**

**కుంభవృష్టి వర్షాలు ప్రాణనష్టం తప్పదు.. రంగం భవిష్య వాణిలో మాతంగి వెల్లడి**



**హైదరాబాద్, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి(రంగం) వినిపించారు. మీరెవరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు. క్రోధంతో వచ్చానని అన్నారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ట చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆపద వచ్చినా ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు. కానీ మీరు చేసే చర్యలే నాకు ఆగ్రహం తెప్పిస్తుందని అన్నారు. వావి వరసలు లేకుండా ఘోరాలు జరుగుతున్నాయనిఅలాంటి వారిని వదిలిపెట్టనని అన్నారు. వారిని పాదాల కింద నలిపేస్తానని అన్నారు. ఈ ఏడాది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతంగి భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవర్షాలు ఉన్నాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది ప్రాణనష్టం భారీగా ..మిగతా 2లో

# న్యాయమూర్తుల సంఖ్య పెంపు

**34 నుంచి 38కి పెంపునకు గ్రీన్ సిగ్నల్**

**చర్చ లేకుండానే ఆమోదం తెలిపిన సభ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రధాన న్యాయమూర్తితో కలిపి 34 నుంచి 38కి పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే, నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం ..మిగతా 2లో






# నిమ్స్‌లో 1000 రోబోటిక్ సర్జరీలు

## దేశంలోనే కొత్త రికార్డ్!

**మూడేళ్ల లోపే ఈ మైలురాయిని అందుకున్న ఆసుపత్రి**

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో దేశంలోనే ఇదొక కొత్త బెంచ్‌మార్క్**

**90 శాతం సర్జరీలు ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ కింద ఉచితంగా నిర్వహణ**

**నిమ్స్ బృందాన్ని అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి, ఆరోగ్య మంత్రి దామోదర**

**హైదరాబాద్, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వైద్య రంగంలో అరుదైన మైలురాయిని అధిగమించింది. మూడేళ్ల కంటే తక్కువ వ్యవధిలోనే 1000 రోబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలంగాణ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. దేశంలోని ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో ఇదొక నూతన రికార్డు అని, సామాన్యులకు సైతం అత్యాధునిక రోబోటిక్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని ప్రభుత్వం పేర్కొంది. ఈ అద్భుత ఘనత సాధించిన నిమ్స్ డైరెక్టర్, యూరాలజీ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు ..మిగతా 2లో


### పెద్ది సుదర్శన్ రెడ్డి విషయంలో
# ప్రభుత్వం ఒత్తిడి

**అది అత్యంత బాధాకరం: కేటీఆర్**

**సుదర్శన్ రెడ్డి ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడేవారు**

**విద్యాశాఖలోని బెడ్స్ కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెట్టారని వెల్లడి**

**అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని మండిపాటు**




**హైదరాబాద్, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిపై తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చిందన్న ఆరోపణలు నిజమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సుదర్శన్ రెడ్డి విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలను ఏ ఒక్కరినీ ..మిగతా 2లో

### పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో
# బీఆర్ఎస్ రాజకీయం

**పదేళ్లలో మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించారని విమర్శ**

**అధికార లాంఛనాలతో గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వెల్లడి**

**వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్య**

**హైదరాబాద్, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో ..మిగతా 2లో



# బీజేపీకి ఘోర పరాభవం

**మూడు ఉప ఎన్నికల్లో రెండు స్థానాల్లో ఓటమి**

**ఓడిన రాష్ట్రాల్లో అధికారంలోనే ఉన్న కమలం**

**ఓటమిపై జెన్ జీ ఉద్యమ ప్రభావం**

**జంతర్ మంతర్‌లో ఉద్యమం ముగిసినా, ఆరని జ్వాలలు**



**న్యూఢిల్లీ, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

దేశంలోని గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో (మంజల్‌పూర్, దాతియా, బంకీపూర్) మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీ కూటమి అధికారంలోకి ఉంది. అయితే, ఈ ఉప ఎన్నికల ఫలితాలు సోమవారం వెల్లడికాగా.. రెండు రాష్ట్రాల్లో బీజేపీకి పరాభవం తప్పలేదు. కేవలం గుజరాత్‌లో మాత్రమే బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఆ పార్టీ అభ్యర్థులు ఓడిపోవటం ..మిగతా 2లో

### బీజేపీ కోటలో
# ప్రశాంత్ కిశోర్ పాగా

**బాంకీపూర్ బై ఎలక్షన్‌లో ఘనవిజయం**

**ఎట్టకేలకు బోణీ కొట్టిన జనసురాజ్ పార్టీ**

**గతంలో 50 వేల మెజార్టీతో బీజేపీ అధ్యక్షుడు నితిన్ గెలుపు**



**న్యూఢిల్లీ, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

బిహార్ ఉపఎన్నికలో బాంకీపూర్ స్థానం నుంచి ప్రశాంత్ కిషోర్ విజయం సాధించారు. ఆయన జనసురాజ్ పార్టీ ఎట్టకేలకు బోణీ కొట్టింది. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌పై ప్రశాంత్ కిషోర్ 18 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో విజయం ..మిగతా 2లో

### సహజీవనంలోనూ
# గృహహింస చట్టం

**లైవ్ ఇన్ రిలేషన షిప్ లోనూ 498ఏ చట్టం వర్తింపు**

**చట్టబద్ధమైన వివాహం కాకపోయినా, స్పష్టమైన ఉద్దేశ్యం ఉంది**

**చారిత్రాత్మక తీర్పును వెలువరించిన సుప్రీంకోర్టు**



**న్యూఢిల్లీ, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

భారత అత్యున్నత న్యాయస్థానం మహిళల హక్కుల పరిరక్షణలో మరొక అత్యంత కీలకమైన, చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. వివాహబంధాన్ని పోలి ఉండే లైవ్-ఇన్ సంబంధాలలో భాగస్వామి నుంచి వేధింపులు లేదా గృహహింసకు గురయ్యే మహిళలకు రక్షణ కల్పిస్తూ, ఇండియన్ పీనల్ కోడ్ లోని సెక్షన్ 498ఏ చట్టం వారికి కూడా వర్తిస్తుందని ధర్మాసనం సంచలన తీర్పునిచ్చింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం ఈ కీలక తీర్పును వెలువరించింది. చట్టపరమైన వివాహం లేకపోయినా, వివాహ బంధాన్ని పోలి ఉండి, పెళ్లి చేసుకోవాలనే స్పష్టమైన ఉద్దేశం ఉన్న సంబంధాలలో వేధింపులు ఎదుర్కొంటే ఈ చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని ..మిగతా 2లో



### కర్నాటక
# మంత్రివర్గ విస్తరణ చిచ్చు

**20 మంది కొత్త మంత్రుల ప్రమాణం**

**చోటు దక్కని ఎమ్మెల్యేల ఆందోళనలు**

**ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ రాజీనామా**

**బెంగళూరు ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

కర్ణాటక ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ నేతృత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ రాష్ట్ర కాంగ్రెస్‌లో చిచ్చు రేపింది. ఆగ్రహావేశాలు, ఆనందోత్సాహాలను చవిచూడాల్సి వచ్చింది. కొం దరిలో విపరీతమైన ఆనందోత్సాహానికి, మరికొందరిలో తీవ్ర ఆగ్రహా వేశాలకు కారణమైంది. ఏకంగా 20 మంది కొత్త మంత్రుల ప్రమాణస్వీకారంతో ఒకవైపు పండుగ వాతావరణం సంతరించుకోగా, మరోవైపు తీవ్ర అసమ్మతి, ధర్నాలు, ఆందోళనలకు దారితీసింది. కేబినెట్‌లో చోటు దక్కకపోవడంతో అసమ్మతి నేతలు బహిరంగంగానే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పదవి దక్కకపోవడంపై తీవ్ర మనస్థాపానికి గురైన ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 'పార్టీ నాయకత్వం నన్ను తీవ్రంగా గాయపరిచింది. అందుకే ఈ నిర్ణయం ..మిగతా 2లో

# సహజీవనంలోనూ గృహహింస చట్టం




**మొదటి పేజీ తరువాయి...**

కోర్టు స్పష్టం చేసింది.ˇర్ణాటకకు చెందిన డాక్టర్ లోకేష్ బి.హెచ్. దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. బాధితురాలు పిటిషనర్‌పై తన మొదటి వివాహాన్ని దాచిపెట్టి, తనను భార్యగా చూస్తూ కట్నం వేధింపులకు, శారీరక దాడికి పాల్పడ్డారని క్రిమినల్ కేసు నమోదు చేసింది. అయితే, వారి మధ్య చట్టబద్ధమైన వివాహం జరగలేదని, కాబట్టి సెక్షన్ 498ఎ ప్రకారం తాను భర్త పరిధిలోకి రానని పిటిషనర్ వాదించారు. దీనిపై విచారణ జరిపిన కర్ణాటక హైకోర్టు క్రిమినల్ చర్యలను కొట్టివేసేందుకు నిరాకరించగా, పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ అప్పీలును తోసిపుచ్చిన అత్యున్నత న్యాయస్థానం, హైకోర్టు తీర్పును సమర్థిస్తూ విచారణ కొనసాగాల్సిందేనని స్పష్టం చేసింది. చట్టాల్లోని భర్త అనే పదానికి విశాలమైన, ఉద్దేశపూర్వకమైన వ్యాఖ్యానం అవసరమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. చట్టబద్ధంగా పెళ్లయిన మహిళకు, వివాహ బంధాన్ని పోలి ఉండే లైవ్-ఇన్ భాగస్వామికి మధ్య గృహహింస వేధింపుల విషయంలో వ్యత్యాసం చూపడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వ హక్కు ను ఉల్లంఘించడమే అవుతుందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. గృహహింస నిరోధక చట్టం కేవలం సివిల్ ఉపశమనాలను మాత్రమే అందిస్తుందని, తీవ్రమైన శారీరక, మానసిక వేధింపులు మరియు కట్న వేధింపుల నుంచి రక్షణ పొందడానికి క్రిమినల్ బాధ్యతను మోపే సెక్షన్ 498ఎ వర్తింపు చాలా అవసరమని కోర్టు పేర్కొంది.

అయితే, ఈ చట్టం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు సుప్రీంకోర్టు కొన్ని కీలకమైన నిబంధనలు, స్పష్టతలను జత చేసింది. ప్రతి లైవ్-ఇన్ సంబంధానికీ ఇది వర్తించదని, ఆ బంధం వివాహ స్వభావాన్ని కలిగి ఉండటంతో పాటు, వారిద్దరికీ పెళ్లి చేసుకునే ఉద్దేశం ఉందనే ప్రాథమిక ఆధారాలను మహిళ నిరూపించాల్సి ఉంటుందని ధర్మాసనం తెలిపింది. అంతేకాకుండా, ఈ నిబంధనల కింద నమోదు చేసే కేసుల్లో అర్నేష్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్ కేసులోని మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, ప్రాథమిక విచారణ నిర్వహించకుండా అరెస్టులు చేయకూడదని పోలీసులను ఆదేశించింది. ఈ చారిత్రాత్మక తీర్పు దేశంలో మారుతున్న సామాజిక సమీకరణలు, ఆధునిక జీవనశైలికి అనుగుణంగా మహిళల చట్టపరమైన హక్కులను మరింత బలపరిచిందని న్యాయ నిపుణులు అంటున్నారు. కేవలం 498ఎ చట్టానికి మాత్రమే ఈ విస్తరణ పరిమితమని, ఇతర క్రిమినల్ లేదా సివిల్ నిబంధనలకు ఇది వర్తించదని ధర్మాసనం ప్రత్యేకంగా పేర్కొనడం ద్వారా చట్టపరమైన సమతుల్యతను కాపాడిందని న్యాయకోవిదులు పేర్కొంటున్నారు.

# న్యాయమూర్తుల సంఖ్య పెంపు

**మొదటి పేజీ తరువాయి...**

ఆరోపణలపై విపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండటంతో ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు ఆమోదం పొందింది. ఆర్డినెన్స్ జారీని వ్యతిరేకిస్తూ విపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో సభ తిరస్కరించింది. సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు-2026ను సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దాని గురించి వివరించారు. అనంతరం బిల్లుపై సభ్యులు మాట్లాడాలని సభాపతి ఓం బిర్లా కోరినప్పటికీ, విపక్షాల నినాదాలు కొనసాగడంతో బిల్లును ఓటింగ్‌కు పెట్టారు. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026కు సభ ఆమోదం తెలిపింది. ఇటీవల జనన, మరణాల నమోదు చట్ట సవరణ బిల్లు కూడా లోక్‌సభలో చర్చ లేకుండానే ఆమోదం పొందింది. తాజా బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభను స్పీకర్ వాయిదా వేశారు.


## పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో
# బీఆర్‌ఎస్ రాజకీయం

**మొదటి పేజీ తరువాయి...**

విరుచుకుపడ్డారు. దివంగత ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం 'ఎక్స్' వేదికగా ఘాటు విమర్శలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆయన్ని విస్మరించి, ఇప్పుడు ఆయన మరణంపై రాజకీయం చేస్తున్న 'మిస్టర్ డ్రామారావు' కేటీఆర్ అంటూ పొంగులేటి మండిపడ్డారు.

పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఉద్యమకారుడైన పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించిందని పొంగులేటి ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఓటమి పాలైన తర్వాత ఆయనకు కనీసం రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ పదవి అయినా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. సంతోష్ రావు, దామోదర్ రావు వంటి వారికి పదవులు కట్టబెట్టిన బీఆర్‌ఎస్ నాయకత్వం, పెద్ది సుదర్శన్ రెడ్డిని ఎందుకు విస్మరించిందని ఆయన ప్రశ్నించారు.

తమ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ది సుదర్శన్ రెడ్డిని వైద్య చికిత్స కోసం వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిందని, ఆయన అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేశారు. ఉద్యమకారులను కేవలం ఓట్ల కోసం వాడుకుని, అధికారం, కీలక పదవులన్నీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం బీఆర్‌ఎస్‌కు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న బీఆర్‌ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయమని పొంగులేటి ధ్వజమెత్తారు.



నిశ్చితార్థం జరుపుకున్న మహావీర్ కుమార్ (వేణు), ఎస్తేర్ రాణి లకు శుభాకాంక్షలు తెలుపుతున్న సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ దేశాల భూపాల్, శంషాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు రాచమల్ల సురేష్, సీనియర్ పాత్రికేయులు అప్పారెడ్డిగూడెం భీమయ్య దానియేలు, చింటు లు

# ఘనంగా వేణు-ఎస్తేర్‌ల నిశ్చితార్థ వేడుక

**బుద్వేల్, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ వాస్తవ్యులు కె లక్ష్మీ కుమారుడు మహావీర్ కుమార్ (వేణు) నిశ్చితార్థం సోమవారం కె శోభ ల కుమార్తె ఎస్తేర్ రాణి తో ఘనంగా జరిగింది. రాజేంద్రనగర్ మన్నా ఫుల్ గాస్పెల్ చర్చి లో చర్చ్ పాస్టర్ రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్, సిస్టర్ సీహెచ్ ప్రభావతి ల ఆధ్వర్యంలో నిశ్చితార్థ వేడుక జరిగింది. నిశ్చితార్థ వేడుకలో రెవరెండ్ అబ్రహాం లింకన్ బైబిల్ సందేశాలను అందచేశారు. ఇరు కుటుంబాల సభ్యులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, బస్తీ పెద్దలు నిశ్చితార్థ వేడుకలో పాల్గొని వేణు, ఎస్తేర్ కు శుభాకాంక్షలు తెలియచేశారు. తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ దేశాల భూపాల్, శంషాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు రాచమల్ల సురేష్, సీనియర్ పాత్రికేయులు అప్పారెడ్డిగూడెం భీమయ్య, చింటు లతో పాటు బస్తీ పెద్దలు వి లక్ష్మీ నారాయణ, డి సాయిలు, చర్చి సభ్యులు సీ హెచ్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి విషయంలో
# ప్రభుత్వం ఒత్తిడి

**మొదటి పేజీ తరువాయి...**

వదలకుండా వేధింపులకు, టార్చర్‌కు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి నిత్యం ప్రజా సమస్యలపై పోరాడేవారని, ప్రభుత్వంలోని అక్రమాలను నిరంతరం బయటపెట్టేవారని కేటీఆర్ గుర్తుచేశారు. సివిల్ సప్లైస్ స్కామ్‌తో పాటు విద్యాశాఖలోని బంకర్ బెడ్స్ కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెట్టారని చెప్పారు. ఆ ఆధారాలను ఈడీ కార్యాలయానికి అందజేయడమే కాకుండా సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారని తెలిపారు. అయితే, సుదర్శన్ రెడ్డి మరణించిన మరునాడే సుప్రీంకోర్టు నుంచి నోటీసులు జారీ అవుతూ గైడెన్స్ రావడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని వ్యక్తులు ఆయన విమర్శలను తట్టుకోలేక, అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను ప్రధాని మోదీ నిలిపివేసారని సీఎం రేవంత్ రెడ్డి బుకాయిస్తున్నారని, ఆయన చేసిన తీర్మానం కేవలం ఒక చిత్తు కాగితమని కొట్టిపారేశారు. సోనియా గాంధీ తెచ్చిన విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారా అని ప్రశ్నించారు. గురుకులాల్లో 150 మంది విద్యార్థులు చనిపోవడం, 7 వేల ఐటీ ఉద్యోగాలు పోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. గోదావరిలో నీళ్లు సముద్రం పాలు అవుతున్నా రైతాంగానికి నీళ్లందించకుండా ఎండబెడుతున్నారని మండిపడ్డారు. పంపింగ్ ద్వారా నీళ్లు మిడ్ మానేరుకు ఎలా వస్తున్నాయో తెలియని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, హెలికాప్టర్లలో వెళ్లి పోజులు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. మెట్రో ప్రాజెక్టును ప్రభుత్వం టేకోవర్ చేయడం వెనుక రూ.200 కోట్లు కొల్లగొట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు వేసిన స్కెచ్ ఉందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసే కుట్రలు సాగుతున్నాయని అన్నారు.

# బీజేపీకి ఘోర పరాభవం

**మొదటి పేజీ తరువాయి...**

ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఓటమికి కారణం స్థానిక కారణాలతోపాటు.. ఇటీవల జరిగిన జెన్‌జీ ఉద్యమ ప్రభావం కూడా కారణమై ఉండొచ్చునని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్ మూడుచోట్లా బీజేపీ ప్రభుత్వమే అధికారంలో ఉంది. అయినా, రెండు రాష్ట్రాల్లోని ఉప ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులు ఓడిపోవటం బీజేపీకి పెద్ద దెబ్బగానే భావించాలి. అయితే, అది జెన్‌జీ వల్లే అయిందా? అంటే ఔనని చెప్పలేం. అలాఅని, కాదని కూడా చెప్పలేం. ఎందుకంటే.. బీహార్ రాష్ట్రంలోనూ నిరసనలు చాలా గట్టిగానే జరిగాయి. స్టూడెంట్స్ నిరసనలు, జెన్‌జీ ఉద్యమంతో ప్రభావితం అయిన వాళ్లు బీజేపీకి వ్యతిరేకంగా ఓటువేసి ఉండొచ్చు. అయితే, జెన్ జీ ఓటర్లు ఆ రెండు నియోజకవర్గాల్లో ఎంతమంది ఉన్నారనేది లెక్కతీస్తేనేగానీ.. జెన్ జీ ఉద్యమం వల్లనే బీజేపీ అభ్యర్థులు ఓడిపోయారని చెప్పగలం. ఇదిలాఉంటే.. ఎన్నికలు జరిగిన జులై 30వ తేదీ నాటికి జంతర్ మంతర్ వద్ద నిరసనలకు ఫుల్ స్టాప్ పడింది. కానీ, ఆ ప్రభావం కొంతకాలం ఉంటుంది. కాబట్టి మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లోని రెండు నియోజక వర్గాల్లో జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఓడిపోయి ఉండొచ్చునని కొందరు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అయితే, ఎక్కువ శాతం మాత్రం స్థానిక ప్రభుత్వాల ఫెయిల్యూర్ గా భావించాలని, అందుకు కొంతశాతం జన్ జీ ఉద్యమం, ఆయా రాష్ట్రాల్లో స్టూడెంట్స్ నిరసనలు కారణం అయ్యి ఉండొచ్చునని పేర్కొంటున్నారు. మొత్తానికి రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉండికూడా ఆ రెండు చోట్ల ఉపఎన్నికల్లో ఓడిపోవటం బీజేపీకి బిగ్ షాకేనని చెప్పొచ్చు.

# బీజేపీ కోటలో ప్రశాంత్ కిశోర్ పాగా

**మొదటి పేజీ తరువాయి...**

సాధించారు. 1995 నుంచి ఈ స్థానంలో బీజేపీ ఎప్పుడూ ఓడిపోలేదు. బిహార్ రాజకీయాల్లో కంచుకోటగా భావించే బాంకీపూర్ ఉపఎన్నిక ఫలితాలు బీజేపీకి గట్టి షాక్ ఇచ్చాయి. బీజేపీ ఊహించని ఓటమి చవిచూడడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. గతేడాది ఎన్నికల్లో ఏకంగా 50 వేలకు పైగా భారీ మెజారిటీతో గెలిచిన బీజేపీ, ఇప్పుడు ఈ స్థానాన్ని కోల్పోవడం పార్టీ వర్గాలను విస్మయానికి గురిచేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ ప్రాతినిధ్యం వహించిన ఈ స్థానంలో కమల దళం పరాజయం పాలవడానికి గల అంతర్గత కారణాలపై పార్టీ అధిష్టానం లోతైన విశ్లేషణ మొదలుపెట్టింది. ఈ ఓటమిపై బీజేపీ నేతలు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఆర్జేడీ తన కోర్ ఓట్లను ప్రశాంత్ కిశోర్ పార్టీకి బదిలీ చేయించిందని బీజేపీ అంచనా వేస్తోంది. బీజేపీకి పట్టున్న అగ్రవర్ణ ఓట్లలో చీలిక తెచ్చేందుకే ఆర్జేడీ ఈ వ్యూహం పన్నిందని భావిస్తోంది. తేజస్వీ యాదవ్ కేవలం ఒక గంట మాత్రమే ప్రచారం చేయడం వెనుక మర్మం ఇదేనని చెబుతోంది. మూడు దశాబ్దాలకు పైగా నితిన్ నబీన్ కుటుంబం ఈ నియోజకవర్గంలో గెలుపొందుతూ వస్తోంది. తండ్రి మరణం అనంతరం ఉప-ఎన్నికల్లో పోటీ చేసిన నితిన్ నబీన్, అప్పటి నుంచి వరుసగా గెలుపొందుతూ వచ్చారు. కానీ ఇప్పుడు ఆయన బీజేపీ జాతీయాధ్యక్షుడు కావడంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, రాజ్యసభ ద్వారా పార్లమెంటులో అడుగుపెట్టారు. ఈ పరిస్థితుల్లో అక్కడ అభ్యర్థి మార్పు అనివార్యంగా మారింది. ఈ మార్పు ఓటర్లపై ప్రభావం చూపిందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. నీట్ పేపర్ లీక్ అంశంపై ఆందోళనలు, యూజీసీ మార్గదర్శకాలు, భరత్ తివారీ ఎన్‌కౌంటర్ వంటి పరిణామాల పట్ల బీజేపీ ప్రధాన కోర్ ఓటర్ల వర్గంలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఇది కూడా ప్రతికూల ప్రభావం చూపిందని పార్టీ భావిస్తోంది. "ఇది కేవలం ఒక స్థానానికి జరుగుతున్న ఉపఎన్నిక మాత్రమే, దీనివల్ల బిహార్ ప్రభుత్వానికి వచ్చే ముప్పేమీ లేదు" అనే భావనలో ఓటర్లు ఉండటంతో.. పోలింగ్ సరళిపై ఆ ప్రభావం పడింది. అందుకే పోలింగ్ శాతం అత్యల్పంగా నమోదైంది. ఇది బీజేపీ కొంపముంచింది. ప్రశాంత్ కిశోర్ పార్టీకి ఎక్కడెక్కడ నుంచి ఎన్ని ఓట్లు పడ్డాయి అనే దానిపై బూత్ వారీగా విశ్లేషణ జరపాలని బీజేపీ నిర్ణయించింది. పార్టీ కోర్ ఓటర్లు ఎందుకు దూరమయ్యారు, ఏయే వర్గాలు చేజారాయి అనే దానిపై పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించి తగిన దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కమల దళం భావిస్తోంది.

# కుంభవృష్టి వర్షాలు ప్రాణనష్టం తప్పదు

**మొదటి పేజీ తరువాయి...**

జరుగుతుందని అన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొంతమంది కళ్లు నెత్తికెక్కి ప్రవర్తిస్తున్నారని మాతంగి స్వర్ణలత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ప్రవర్తన తనకు సంతోషం కలిగించడం లేదని తెలిపారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర చివరి ఘట్టానికి చేరుకుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా రంగం భవిష్యవాణిని మాతంగి స్వర్ణలత వినిపించారు. తాను సంతోషంగా లేనని, క్రోధంతో వచ్చానని భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవృష్టి ఉంది. వర్షాల్లో ప్రజలు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. రంగం భవిష్యవాణితో ఈ బోనాల జాతర ముగిసింది. ఈ నేపథ్యంలో భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. రంగం అనంతరం అమ్మవారిని అంబారీపై ఊరేగించారు.

# కర్నాటక మంత్రివర్గ విస్తరణ చిచ్చు

**మొదటి పేజీ తరువాయి...**

తీసుకున్నాను' అని ఆయన పేర్కొన్నారు. అలాగే బేలూరు ఎమ్మెల్యే గోపాలకృష్ణ రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, మైసూర్ నాయకుడు తన్వీర్ సేట్‌కు మంత్రివర్గంలో చోటు నిరాకరించడంతో, ఆయన మద్దతుదారు ఒకరు మైసూరులో విషం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. అతన్ని ప్రస్తుతం ఆసుపత్రికి తరలించగా, తన్వీర్ సేట్ నేరుగా వెళ్లిపరామర్శిం చారు. ధార్వాడ్‌లో ప్రసాద్ అబ్బయ్య మద్దతుదారులు రహదారిపై టైర్లు కాల్చి, ప్రభుత్వ బస్సుపై రాళ్ళు రువ్వి ఆందోళన చేపట్టారు. హెచ్‌కే పాటిల్, దినేష్ గుండూరావుతో సహా పదవులు దక్కని సీనియర్ నాయకులు బెంగళూరులోని పీ.వీ. జయచంద్ర నివాసంలో అత్యవసర రహస్య సమావేశం ఏర్పాటు చేసి తదుపరి కార్యాచరణపై చర్చిస్తున్నారు.మంత్రి మునియప్ప అసంతృప్తి: మరోవైపు సీనియర్ నేత, కేబినెట్ మంత్రి కె.హెచ్. మునియప్ప కూడా తన శాఖ కేటాయింపుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, శాఖను మార్చాలని కోరుతున్నట్లు సమాచారం.ప్రమాణస్వీకారానికి కొన్ని గంటల ముందు కేబినెట్ జాబితాలో నాటకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత ప్రకటించిన ముసాయిదా నుంచి మంకాల్ వైద్య, గాయత్రి చంద్రశేఖర్‌లను తొలగించి, ఆఖరి నిమిషంలో సీనియర్ నేత ఎస్.ఎస్. మల్లికార్జున్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించారు. కర్ణాటక కాంగ్రెస్ విస్తరణపై బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయా తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ చెబుతున్న సామాజిక న్యాయం, మహిళా సాధికారత మాటలకే పరిమితమని ఎద్దేవా చేశారు. కేబినెట్‌లో ఏకైక మహిళకే చోటు ఇవ్వడం, బ్రాహ్మణ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లేకపోవడం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బి. నాగేంద్ర, జమీర్ అహ్మద్ ఖాన్‌లను తిరిగి కేబినెట్‌లోకి తీసుకోవడం కాంగ్రెస్ డొల్లతనాన్ని బయటపెడుతోందని ఆరోపించారు.

# నిమ్స్‌లో 1000 రోబోటిక్ సర్జరీలు

**మొదటి పేజీ తరువాయి...**

యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియాలజీ, నర్సింగ్, ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (నిమ్స్ పాలకమండలి అధ్యక్షుడు) ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం 1000 శస్త్రచికిత్సలలో యూరాలజీ విభాగం 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ 248, సర్జికల్ ఆంకాలజీ 162 సర్జరీలు నిర్వహించాయి. వీటిలో 90 శాతానికి పైగా ఆపరేషన్లను ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకాల ద్వారా ఉచితంగా అందించడం గమనార్హం. రాడికల్ ప్రోస్టేటెక్టమీ, రాడికల్ సిస్టెక్టమీ, క్లిష్టమైన రోబోటిక్ రీనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. రోబోటిక్ శస్త్రచికిత్సల వల్ల కచ్చితత్వం మెరుగుపడుతుందని, శస్త్రచికిత్స అనంతరం నొప్పి, రక్తస్రావం తగ్గడంతో పాటు రోగులు వేగంగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. సామాన్య పౌరులకు అత్యుత్తమ వైద్య సేవలను చేరువ చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొంటూ నిమ్స్ బృందాన్ని ప్రశంసించారు.



డీజీఎంకి వినతిపత్రం అందిస్తున్న గుల్షన్ నగర్ కాలని వాసులతో అంజనేయులు సాగర్

# గుల్షన్ నగర్‌లో డ్రైనేజీ, మంచినీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి:

### ఆంజనేయులు సాగర్... వాటర్ బోర్డు అధికారులకు వినతిపత్రం అందజేత

**శేరిలింగంపల్లి : ఆగస్టు 3, (ప్రభాత ఉదయం)**

గుల్షన్ నగర్ కాలనీలో తీవ్ర రూపం దాల్చిన డ్రైనేజీ, తాగునీటి సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ డిమాండ్ చేశారు. దెబ్బతిన్న డ్రైనేజీ పైప్‌లైన్ల వల్ల మురుగునీరు రోడ్లపైకి పొంగిపొర్లుతుండటం, కాలనీలో తాగునీటి ఎద్దడి తలెత్తడంతో కాలనీవాసులతో కలిసి ఆయన వాటర్ బోర్డు అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు.గుల్షన్ నగర్ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ దెబ్బతినడంతో మురుగు నీరు రోడ్లపై పొంగిపొర్లుతోందని, దీంతో స్థానిక ప్రజలు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణం వల్ల కాలనీలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**ప్రతిరోజూ తాగునీరు అందించాలి:**

అలాగే కాలనీలో మంచినీటి సరఫరా సక్రమంగా జరగకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తగిన ప్రెషర్‌తో ప్రతిరోజూ తాగునీరు అందేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దెబ్బతిన్న డ్రైనేజీ పైప్‌లైన్‌ను అత్యవసరంగా మార్చి, డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అధికారుల హామీ: సమస్య తీవ్రతను వివరించిన అనంతరం వినతిపత్రాన్ని స్వీకరించిన వాటర్ బోర్డు డీజీఎం నరేందర్ రెడ్డి, మేనేజర్ విక్రమ్ రెడ్డి స్పందిస్తూ... సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రియాజ్ ఉద్దీన్, వలీయుద్దీన్, కమరుద్దీన్, రహమతుల్లా, సాదత్, అబ్బాస్ భాయ్, ఫరూక్ భాయ్, సలీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# కుంటను పరిరక్షించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**



గద్వాల మండలం లత్తిపురం గ్రామ శివారులో ఉన్న "రేగుమాను కుంట"ను రాజకీయ అండదండలతో కొందరు వ్యక్తులు అక్రమించుకుని, నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువును నిర్మిస్తున్నారని, అధికారులు ఈ అక్రమ తవ్వకాలను నిలిపివేసి కుంటను పరిరక్షించాలని గ్రామ రైతులు సోమవారం జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామ శివారులో 28 ఎకరాలు విస్తీర్ణంలో ఉన్న ఈ కుంట క్రింద 40 ఎకరాల విస్తీర్ణంలో సాగుతోందని, రెవెన్యూ మరియు మత్స్య శాఖ అధికారుల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోకుండానే ఈ తవ్వకాలు జరుగుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు.గ్రామ పంచాయతీ గానీ, పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గానీ ఎలాంటి అనుమతులు లేని ఈ అక్రమ తవ్వకాలపై తక్షణమే సర్వే నిర్వహించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మైలార్దేవ్‌పల్లిలో ఘనంగా బోనాల వేడుకలు.





## పలు ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకున్న ప్రకాష్‌గౌడ్

**రాజేంద్రనగర్,ఆగస్టు03(ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర విశిష్ట పండుగైన ఆషాఢ బోనాల సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్దేవ్‌పల్లి ప్రాంతం భక్తిశ్రద్ధలతో కళకళలాడింది.బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని శాసనసభ్యుడు ప్రకాష్‌గౌడ్ సోమవారం మైలార్దేవ్‌పల్లి పరిధిలోని పలు అమ్మవారి దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉదయం నుంచి వివిధ దేవాలయాలకు వెళ్లిన ప్రకాష్‌గౌడ్ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.దేవాలయ అర్చకులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించగా అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు,స్థానిక నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆషాఢ మాస బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.అమ్మవారి చల్లని ఆశీస్సులు రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని,ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు.బోనాల పండుగ ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యంతో పాటు సామాజిక ఐక్యతను పెంపొందిస్తుందని తెలిపారు.తెలంగాణ సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయడం ఆనందదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు,దేవాలయ కమిటీ సభ్యులు,మహిళలు,యువకులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.



కంటి పరీక్షలు చేయించుకుంటున్న తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ దేశాల భూపాల్. చిత్రంలో జీ ఎల్ ఎం వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ శ్యామ్ గుంటి తదితరులు

## చైతన్య రూరల్ డెవలమెంట్ సోషల్ సర్వీస్ సోసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

**బుద్వేల్, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

ప్రతి నెల మొదటి ఆదివారం ఉప్పర్ పల్లి లోని గుడ్ లైఫ్ మినిస్ట్రీస్ (జీఎల్ఎం) అకాడమీ లో చైతన్య రూరల్ డెవలప్మెంట్ సోషల్ సర్వీస్ సోసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు, కళ్ళజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జీఎల్ఎం వ్యవస్థాపక అధ్యక్షులు బ్రదర్ శ్యామ్ గుంటి తెలిపారు. ఉప్పర్ పల్లి పరిసర బస్తీలకు చెందిన 130 మంది ప్రజలు ఆదివారం రాత్రి వరకు నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల శిబిరానికి హాజరై కంటి పరీక్షలు చేయిం చుకున్నారన్నారు. వారందరికి కళ్లజోల్లు ఇవ్వడానికి చైతన్య రూరల్ డెవలప్మెంట్ సోషల్ సోసైటీ కళ్లద్దాలకు సంబందించిన ఫ్రేమ్ లను చూపెట్టి అద్దాలు వచ్చే ఆదివారం లోపు పరీక్షలు చేయించుకున్న వారికి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత కంటి పరీక్షల శిబిరంలో సమాచార హక్కు చట్టం కమిషనర్ దేశాల భూపాల్, కంటి పరీక్షల నిపుణులు నూర్ (ఆప్టోమెట్రిస్ట్స్), సిస్టర్ లు రీనా, హింధు, రెవరెండ్ పి .స్వర్ణకుమార్, బ్రదర్ అప్పారెడ్డిగూడెం భీమయ్య దానియేలు జీఎల్ఎం సిబ్బంది దాసు, యుగంధర్, ప్రదీప్, ప్రమోద్, అభిషేక్, మీడియా సిబ్బంది పాల్గొన్నారు.



కంటి పరీక్షల శిబిరాన్ని ప్రారంభిస్తున్న జీ ఎల్ ఎం వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ శ్యామ్ గుంటి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎ బిజూ కుమార్

## తీర ప్రాంత జీవనోపాధులను పెంచడానికి పరిశోధనలు జరగాలి : డాక్టర్ ఎ బిజూ కుమార్

**బుద్వేల్, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం):**

సముద్ర వనరులను స్థిరంగా ఉపయోగించుకుంటు తీర ప్రాం త జీవనోపాధిని బలోపేతం చేయడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని కేరళ యూనివర్శిటీ ఆఫ్ ఫిషరీస్ అండ్ ఓషన్ స్టడీస్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ బిజు కుమార్ అన్నారు. రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనెజ్మెంట్ (నార్మ్) లో సోమవారం సముద్ర జీవ సాగు కోసం నీలి ఆర్థిక విధానం ఫ్రేమ్ వర్క్ పై జాతీయ ప్రధాన సంప్రదింపుల సమావేశం నిర్వహిం చారు. అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్(ఎఎన్ఆర్ఎఫ్) ప్రధానమంత్రి ప్రారంభ కెరీర్ పరిశోధన గ్రాంట్ ప్రాజెక్టు లో బాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎ బిజు కుమార్ మాట్లాడుతూ, భారత దేశ నీలి ఆర్థిక వ్యవస్థలో మత్స్య, ఆక్వా కల్చర్, సముద్ర జీవ సాగు రంగాల ప్రామ ఖ్యత ప్రధానమైనదన్నారు. ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడానికి తీర ప్రాంత జీవనోపాధిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆహార, పౌష్టికాహార భద్రతకు దోహదపడటానికి మత్స్య, ఆక్వా కల్చర్, సముద్ర జీవ సాగు రంగాలకు సామర్థ్యం ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ లోని జాతీయ మత అభివృద్ధి బోర్డు ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ బిజయ్ కుమార్ బెహెరా మాట్లాడుతూ, భవిష్యత్తులో సముద్రపు చేపల పెంపకం ఉత్పాదకతను పెంచడంలో ఏఐ ఆధాంరిత భౌగోళిక జీవ, సాంకేతిక, ఆర్థిక సమ్మేళన మేధోమధన చట్రం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. జీవ సంబంధ అనుకూలత, పర్యావరణ పరిస్థితులు, ఆర్థిక అంశాలు, మౌళిక సదుపాయాలు, మార్కెట్లు, పెట్టుబడి నష్టాలకు సంబందించిన కీలక సమాచారం యొక్క విచ్ఛిన్నత ను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. రాజేంద్రనగర్ లోని పీవీ నర్సింహ్మారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఎం జ్ఞాన ప్రకాశ్ మాట్లాడుతూ, సముద్రపు చేపల పెంపకం రంగంలో అర్థవంతమైన పరివర్తన తీసుకురావడానికి మత్స్య విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల మధ్య మరింత సహకారం ఉం డాలన్నారు. విద్యా, శాస్త్రీయ వర్గాలు ఒక ఉమ్మడి లక్ష్యం వైపు సమిష్టిగా పనిచేయాలని, సంస్థాగత సహకారాన్ని బలోపేతం చేయాలని ఆయన కోరారు. నార్మ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎం సుందరం మాట్లాడుతూ, భారత దేశం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద చేపల ఉత్పత్తి దారు అని అన్నారు. వార్షికం గా దాదాపు 198 లక్షల టన్నుల చేపలను ఉత్పత్తి చేస్తోందని, 2025 లో సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు రూ. 73,890,46 కోట్లను దాటాయని తెలిపారు. నార్వే, చైనా, జపాన్ వంటి అగ్రగామి దేశాలతో పోలిస్తే ఈ రంగంలో భారత దేశ ఉత్పాధకత తక్కువ గా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సురేశ్ కుమార్ మెజాడ, డాక్టర్ గణేశ్, డాక్టర్ ఎల్ రంజిత్ లు పాల్గొన్నారు.



బుద్వేల్ లో డ్రైనేజ్ పనులను చేయిస్తున్న జలమండలి ఉద్యోగి పెండ్యాల సాయి మల్లిక్

**బుద్వేల్ లో వారం రోజులుగా డ్రైనేజీ మ్యాన్ హోల్ లు పొంగి రహదారిపై పారుతు దుర్వాసన వెదజల్లుతుండటం గమనించిన స్థానికులు జలమండలి ఉద్యోగి పెండ్యాల సాయి మల్లిక్ కు సమస్యను చెప్పడంతో ఆయన వెంటనే స్పందించి డ్రైనేజీ మ్యాన్ హోల్ కు మరమ్మత్తులు చేయించి సమస్యకు పరిష్కారం చూ పారు.**

బుద్వేల్, ప్రభాత ఉదయం

## ఇండ్లు ఇచ్చారు... నీళ్లు మరిచారు

**నీళ్లు లేక ప్రజలు అవస్థలు**

**తాగునీటి సౌకర్యం కల్పించాలని లబ్దిదారుల వినతి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**






గద్వాల మండలం గోనుపాడు గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లనుఇటీవల అర్హులైన 25 మంది లబ్దిదారులకు పంపిణి చేశారు. అసంపూర్తిగా నిర్మించిన ఇళ్లలో సరైన వసతి లేకపోవడంతో లబ్దిదారులు సొంత ఖర్చులతోనే పనులు పూర్తి చేసుకుంటున్నారు. కనీస అవసరాల కోసం నీరందించేందుకు పైప్ లైన్ నిర్మించకపోవడంతో లబ్దిదారులు వ్యవసాయ పొలాల వద్ద తాగునీటిని తెచ్చుకోవలసిన పరిస్థితి నెలకొంది. మిషన్ భగీరథ పైప్ లైన్ ద్వారా త్రాగు నీటిని అందించాలని లబ్దిదారులు అధికారులను కోరుతున్నారు.

## ఎలక్ట్రిక్ షాపులో రూ.30 వేల కాపర్ వైర్ చోరీ

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**



గద్వాల పటణంలోని పాత కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న ఒక ఎలక్ట్రిక్ షాపులో సుమారు రూ. 30వేలు విలువైన కాపర్ వైర్ చోరీకి గురైంది. బాదితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాత బస్టాండ్ సమీపంలో గల సోనీ ఎలక్ట్రిక్ షాపు వద్దకు కొనుగోలుదారుల వలె వచ్చిన గుర్తుతెలియని మహిళలు, యజమాని దృష్టిని వేరే వైపు మళ్లించి కాపర్ వైర్ బండిల్‌ను ఎత్తుకెళ్లారు. అనంతరం షాపు యజమాని గమనించి చూసేసరికి వైర్ కనిపించకపోవడంతో సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారు. అందులో మహిళలు వైర్ చోరీ చేస్తున్న దృశ్యాలు స్పష్టంగా రికార్డయ్యాయి.సమాచారం అందుకున్న గద్వాల టౌన్ ఎస్ఐ కళ్యాణ్ కుమార్ సంఘటన స్థలాని పరిశీలించారు. సీసీటీవీ ఫుటేజ్ చోరీకి పాల్పడిన మహిళల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. గద్వాల పట్టణంలోని వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఎస్ఐ సూచించారు.

## మల్లపురం తండా పాఠశాలకు విద్యా వాలంటీర్‌ను నియమించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3(ప్రభాత ఉదయం)**



కేటిదొడ్డి మండలం మల్లపురం తండా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సరైన బోధన అందేలా విద్యా వాలంటీర్‌ను నియమించాలని కోరుతూ సోమవారం మల్లపురం తండా గ్రామ సర్పంచ్ కే. పాండు నాయక్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కే. పాండు నాయక్ మాట్లాడుతూ... పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యార్థుల చదువుకు తీవ్ర దూరమవుతున్నారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా వాలంటీర్‌ను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన డిఈఓ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని సర్పంచ్ తెలిపారు.

# బోనాల తొట్టెల ఊరేగింపుల్లో పాల్గొన్న పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

## భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు

**రాజేంద్రనగర్,ఆగస్టు03(ప్రభాత ఉదయం)**





రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి సోమవారం మైలార్దేవ్పల్లి,రాజేంద్రనగర్ డివిజన్ల పరిధిలోని పలు దేవాలయాలను సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు.అనంతరం వివిధ బస్తీలు,కాలనీలలో నిర్వహించిన తొట్టెల ఊరేగింపుల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గగన్‌పహాడ్ బస్తీలో నిర్వహించిన అమ్మవారి తొట్టెల ఊరేగింపులో కార్తీక్‌రెడ్డి భక్తులతో కలిసి అడుగులు కలిపారు.డప్పు వాయిద్యాలు,భక్తుల జైజైధ్వానాలు,సాంప్రదాయ కళారూపాల మధ్య సాగిన ఊరేగింపులో పాల్గొని భక్తులను పలకరించారు.స్థానిక యువతతో మమేకమై వారిని ఉత్సాహపరుస్తూ పండుగ వేడుకల్లో సందడి చేశారు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని,ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే గొప్ప పండుగలలో బోనాలు ఒకటని అన్నారు.బోనాల పండుగ కేవలం ఆధ్యాత్మిక వేడుక మాత్రమే కాకుండా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు,సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఉత్సవాలు తెలంగాణ ప్రత్యేకతను చాటుతున్నాయని అన్నారు.నియోజకవర్గ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని,ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.పలు దేవాలయ కమిటీలు,ఉత్సవ కమిటీ సభ్యులు కార్తీక్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు.పూలమాలలు వేసి సన్మానించారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు.మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొనగా యువత భారీ సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో శీలం తిరుపతిరెడ్డి,ఎర్రోళ్ల యాదయ్యతో పాటు స్థానిక నాయకులు,ఉత్సవ కమిటీ సభ్యులు,యువకులు, మహిళలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట: రాష్ట్ర మంత్రి అజారుద్దీన్






**దేవరకద్ర, ఆగస్ట్ 3(ప్రభాత ఉదయం)**

కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని కేటీఆర్ గార్డెన్స్‌లో తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తురుక కాశ ముస్లిం కమ్యూనిటీకి చెందిన లబ్ధిదారులకు జనరేటర్లు, టూల్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మైనార్టీ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ , తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ . ఒబెదుల్లా కొత్వాల్ తో కలిసి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి లబ్ధిదారులకు జనరేటర్లు, టూల్ కిట్లను పంపిణీ చేశారు. మైనార్టీల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి ప్రోత్సాహానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే జియంఆర్ తెలిపారు. జనరేటర్లు, టూల్ కిట్ల వంటి ఉపాధి ఆధారిత పథకాల ద్వారా లబ్ధిదారులు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఎమ్మెల్యే జిఎంఆర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కొత్తకోట, దేవరకద్ర, భూత్పూర్, అడ్డాకుల, చిన్న చింతకుంట మండల కేంద్రాల్లో మిని షాదీ ఖానాలను మంజూరు చేయాలని మైనార్టీ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌ను ఎమ్మెల్యే జియంఆర్ కోరారు. ఎమ్మెల్యే జిఎంఆర్ విజ్ఞప్తిపై మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ సానుకూలంగా స్పందించారు. అనంతరం దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న నాయకుడు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ని మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ప్రశంసించారు. మైనార్టీల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి సచివాలయంలోని మైనార్టీ శాఖ కార్యాలయానికి అనేక సార్లు వచ్చి నిరంతరం ఫాలోఅప్ చేసిన ఎమ్మెల్యే . జి. మధుసూదన్ రెడ్డి లాంటి కమిట్మెంట్ ఉన్న ఎమ్మెల్యేను తాను చూడలేదని మంత్రి గారు పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై చిత్తశుద్ధి, ప్రజల పట్ల అంకితభావంతో పనిచేస్తున్న జియంఆర్ ని ప్రజలు మరోసారి గెలిపించాలని, ఎన్నిసార్లు పోటీ చేస్తే, అన్ని సార్లు గెలిపించాలని మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ నియోజకవర్గ ప్రజానీకానికి పిలుపునిచ్చారు. తదనంతరం మైనార్టీల సంక్షేమం, ఉపాధి కల్పన, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్, మార్కెట్ యార్డ్ చైర్మన్, కొత్తకోట మున్సిపాలిటీ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచులు తదితర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## గద్వాల పట్టణంలో కుండపోత వర్షం

**నీట మునిగిన పాత బస్టాండ్, పాత కూరగాయల మార్కెట్**

**ఈ సీజన్ లో ఇదే అతి పెద్ద వర్షం**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**



సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గద్వాల పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా పాత బస్టాండ్ పరిసరాలు, పాత కూరగాయల మార్కెట్ ప్రాంతం, రథశాల వద్ద ప్రధాన రోడ్లు నీట మునిగిపోవడంతో ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. పాత బస్టాండ్ ప్రధాన రహదారిపై మోకాళ్ల లోతు వరకు వర్షపు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే పాత కూరగాయల మార్కెట్‌లోకి వరద నీరు చేరడంతో వ్యాపార సరుకులు తడిసిపోయి సన్నకారు వ్యాపారులకు భారీ నష్టం వాటిల్లింది. పట్టణంలోని మురుగునీటి కాలువ నుంచి మురుగు నీరుస్వల్ప వ్యవధిలోనే రోడ్లపైకి చేరి పొంగిపొర్లిపోయింది. ఈ వర్షకాలంలో ఏకదాటిగా గంటకు పైగా భారీ వర్షం కురవడం ఇదే తొలిసారి. భారీ వర్షం కారణంగా జన జీవనం అతలాకుతలమైంది. ఇళ్ల నుంచి ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. వీధులు వరద నీటి ప్రవాహంతో చెరువులను తలపించాయి.



## జలమండలిలో 11 మంది ఉద్యోగులు పదవీ విరమణ

**ఖైరతాబాద్, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

జలమండలిలో పనిచేస్తున్న పదకొండు మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. సోమవారం ఖైరతాబాద్ లోని బోర్డు ప్రధాన కార్యాలయంలో పదవి విరమణ చేసిన అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పీ అండ్ ఏ సీజీఎం సురేష్, జీఎం టీవీ సరస్వతిల పాటు పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డికి పూల మొక్కను అందజేస్తున్న కొత్తకోట నూతన ఎస్సై విక్రం

## జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన కొత్తకోట నూతన ఎస్సై ఎం. విక్రమ్:

**శాంతి, భద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా విధులు నిర్వహించాలి**

**ప్రజల భద్రతే లక్ష్యంగా విధులు నిర్వహించాలి : జిల్లా ఎస్పీ సునిత రెడ్డి,**

**కొత్తకోట , ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

కొత్తకోట పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎం. విక్రమ్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు అందించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల సమస్యల పరిష్కారంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదును బాధ్యతతో స్వీకరించి చట్ట ప్రకారం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంపొందించేలా ప్రజల విశ్వాసాన్ని పొందే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎం. విక్రమ్ గతంలో మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ, తాజాగా బదిలీపై కొత్తకోట పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఇంతకుముందు కొత్తకోట ఎస్సైగా పనిచేసిన శివానందం బదిలీపై వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై ఎం. విక్రమ్ మాట్లాడుతూ, ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించేందుకు కృషి చేస్తానని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ పోలీసుశాఖకు సహకరించి నేరరహిత సమాజ నిర్మాణానికి భాగస్వాములు కావాలని కోరారు.ు



తాసిల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న బి ఆర్ ఎస్ నాయకులు

## కానాయపల్లి చెరువు (శంకరసముద్రం) ఆయకట్టు రైతులకు సాగునీరు ఆందించాలి

**కొత్తకోట, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

కానాయపల్లి చెరువు (శంకరసముద్రం) ఆయకట్టు రైతులకు సాగునీరు ఆందించాలని కొత్తకోట తహశీల్దార్ కు మాజీ జడ్పీ వైస్ చైర్మన్ జి. వామన్ గౌడ్, సిడిసి మాజీ చైర్మన్ భీసం చేన్నకేశవరెడ్డి లు వినతి పత్రం అందజేశారు. కానాయపల్లి చెరువు (శంకర సముద్రం) కింది ఆరు గ్రామాల ఆయకట్టు రైతులతో కలిసి సోమవారం కొత్తకోట మండలం తహశీల్దార్ కు వినతి పత్రం అందించిన మాజీ వైస్ చైర్మన్ గుంబ్రాతి వామన్ గౌడ్ , ఉమ్మడి పాలమూరు జిల్లా సిడిసి మాజీ చైర్మన్ భీసం చేన్నకేశవరెడ్డి గత వారం రోజులుగా జూరాల ప్రాజెక్టుకు భారీ వరదలు వస్తున్న కారణంగా రామన్ పాడ్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి ఉంది. శంకరసముద్రమునకు భీమా స్టేజ్ 1, స్టేజ్ 2 నుండి మోటారు ప్రారంభం చేసినారు. కావున ఆ గ్రామ రైతులకు 19 ప్యాకేజీ దగ్గర రైతులకు సాగునీరు వదలగలరు. అదేవిధంగా భీమా స్టేజ్ 1, భీమా స్టేజ్ 2 దగ్గర కూడా రెండవ మోటార్ ప్రారంభించగలరు అని నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వగలరని వినతి పత్రంలో కోరారు. అదేవిధంగా వర్షాలు సరైన సమయంలో కురువనందున ఆరుతడి పంటలకు నీరు లేక చాలా ఇబ్బందిగా ఉన్నది. కావున మాపై దయవుంచి శంకరసముద్రం ఆయకట్టు గ్రామాలు కానాయపల్లి, నిర్వేన్, పాలెం, రామనాథపురం, అగ్రహారం, కొత్తకోట, దంతనూరు గ్రామ రైతులం మేము చేయు మనవి భీమా స్టేజ్ 1, స్టేజ్ 2 దగ్గర రెండవ మోటార్ ప్రారంభించాడానికి అవకాశం ఉన్న కూడా ప్రారంభించట్లేదు. మాపై దయవుంచి రెండవ మోటార్ కూడ ప్రారంభించి పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీరు చేరే విధంగా రైతులను ఆదుకోవాలని ఈ సందర్భంగా కొత్తకోట మండల తహసీల్దార్ గారికి వినతి పత్రం అందించి కోరారు. ఇట్టి కార్యక్రమంలో నారామన్ అయ్యన్న,లాయర్ యాదగిరి,జలంధర్ రెడ్డి, కొత్తకోట మాజీ వార్డు సభ్యులు రాజు కూమార్ రెడ్డి, వేముల జనార్ధన్ రెడ్డి,వహిద్,బాబా,యన్. మోహన్ రెడ్డి, వహిద్, తాహిర్ ,తంగల్,నాగరాజు,పయాజ్ , మహేష్, వికాస్,రాజ్ కుమార్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణికి 102 ఫిర్యాదులు

**ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

ప్రజావాణిలో మొత్తం 102 ఫిర్యాదుల స్వీకరణ– రెవెన్యూ శాఖకు 33, ఇతర శాఖలకు 69 వినతులు వచ్చాయని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.– ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 102 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందుతున్న ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, నిర్దేశిత గడువు లోగా పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు చెందిన 33, ఇతర శాఖలకు చెందిన 69, మొత్తం 102 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఫుడ్ సేఫ్టీ అధికారుల పేరుతో మోసాలకు పాల్పడే వ్యక్తులను నమ్మవద్దు

**లైసెన్స్‌లు, శిక్షణ కోసం నేరుగా శాఖ అధికారులను మాత్రమే సంప్రదించాలి: జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్ కుమార్**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3(ప్రభాత ఉదయం)**

ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో, అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆహార భద్రత తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్న సందర్భంలో, కొందరు వ్యక్తులు జిల్లా ఫుడ్ సేఫ్టీ విభాగానికి చెందిన అధికారులమని చెప్పుకుంటూ వ్యాపారులను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖ దృష్టికి వచ్చినట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్ కుమార్ తెలిపారు. కొంతమంది వ్యక్తులు "ట్రైనింగ్ సర్టిఫికెట్లు ఇప్పిస్తాం", "లైసెన్స్‌లు ఇప్పిస్తాం" అంటూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందిందని పేర్కొన్నారు. ఇటువంటి వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని, వారికి ఎలాంటి నగదు చెల్లించవద్దని వ్యాపారులకు సూచించారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లు, శిక్షణ కార్యక్రమాలు లేదా ఇతర అధికారిక సేవలకు సంబంధించి అవసరమైన సమాచారం కోసం నేరుగా జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారులను మాత్రమే సంప్రదించాలని తెలిపారు. అధికారిక విధానాల ప్రకారమే అన్ని సేవలు అందించబడతాయని స్పష్టం చేశారు. వ్యాపారులు అప్రమత్తంగా ఉండి మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనల గురించి వెంటనే జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖకు సమాచారం అందించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీ మనోజ్ కుమార్ కోరారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు విజయవంతం చేయాలి: కలెక్టర్ నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**



ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను అధికారులు విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రంగారెడ్డి నారాయణరెడ్డి ఆదేశించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు (ఆగస్టు 1 నుండి 7 వరకు) సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో మహిళాభివృద్ధి , శిశు సంక్షేమ శాఖ రూపొందించిన పోస్టర్లను సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్,జిల్లా మేజిస్ట్రేట్ సి. నారాయణ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కిరణ్మయి, జిల్లా సంక్షేమ అధికారి శాంతి, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి స్వర్ణలత, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సునీల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లా సంక్షేమ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని, పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వడం అత్యంత ముఖ్యమని తెలిపారు. పుట్టినప్పటి నుండి మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం తగిన పౌష్టికాహారంతో పాటు రెండు సంవత్సరాల వయస్సు వరకు తల్లిపాలు కొనసాగించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన సంపూర్ణ పోషకాలను అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందించి, అనేక అంటువ్యాధుల నుండి రక్షిస్తాయని తెలిపారు. అలాగే తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రపంచ తల్లిపాల వారోత్సవాల థీమ్ -- "తల్లిపాలకు ప్రాధాన్యత ఇద్దాం: సుస్థిరమైన సహాయ వ్యవస్థలను ఏర్పాటు చేద్దాం" అనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా చేర్చేందుకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కిరణ్మయి మాట్లాడుతూ... తల్లిపాలు ఇవ్వడం కేవలం తల్లి బాధ్యత మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం , ప్రభుత్వ ఉమ్మడి బాధ్యత అని అన్నారు. ప్రతి శిశువుకు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించాలంటే తల్లిపాల ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించి, తల్లులకు పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. జిల్లా సంక్షేమ అధికారి శాంతి మాట్లాడుతూ, మహిళాభివృద్ధి , శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుండి 7 వరకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో ర్యాలీలు, అవగాహన సదస్సులు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు మరియు వారి కుటుంబ సభ్యులు తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి, పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలిచ్చే అలవాటును ప్రోత్సహించాలని, అలాగే మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలే అందించాలని కోరారు.

ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

# విద్య, వైద్యం, నీటిపారుదలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత: ఎమ్మెల్యే జిఎంఆర్

**కొత్తకోట, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్యం నీటిపారుదలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు జిఎంఆర్ తెలిపారు. సోమవారం కొత్తకోట మండల జనరల్ బాడీ సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు.కొత్తకోట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య (జనరల్ బాడీ) సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొని అన్ని ప్రభుత్వ శాఖల పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ, విద్య, వైద్య ఆరోగ్యం, విద్యుత్, హౌసింగ్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా, పశుసంవర్ధక, ఆర్అండ్బీ, ఉద్యానవన, ఇరిగేషన్, ఫారెస్ట్, వెటర్నరీ తదితర శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని ఎమ్మెల్యే కి వివరించారు.అనంతరం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యానికి తావు లేకుండా జవాబుదారీతనంతో పనిచేయాలని ఆదేశించారు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సర్పంచులతో సమన్వయం పెంచి గ్రామస్థాయిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని, రెవెన్యూ శాఖ భూ సమస్యలు, ప్రజల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో అడ్మిషన్లు పెరిగాయని పేర్కొంటూ విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ కొనసాగుతుందని తెలిపారు.ఉపాధి హామీ పథకం కింద కొత్త పనులపై సర్పంచులకు అవగాహన కల్పించి, ప్రతి గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు, నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, రాబోయే సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు త్వరలో ట్రాన్స్‌ఫార్మర్లు, ఏబీ స్విచ్‌లు, విద్యుత్ పోల్స్ పంపిణీ కార్యక్రమాలను త్వరలో మండలాల వారీగా చేపడతామని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ప్రతి గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా నిరంతర నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, పశు వైద్య సేవలను గ్రామస్థాయిలో మరింత సమర్థవంతంగా అందించాలని చెప్పారు.గ్రామాలు, మండల కేంద్రాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై





ప్రత్యేక దృష్టి పెట్టాలని, రోడ్లు, భవనాల నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించి రైతులకు అవగాహన కల్పించాలని హార్టికల్చర్ శాఖ అధికారులకు సూచించారు.విద్య, వైద్యం, ఇరిగేషన్ వంటి కీలక రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.తదనంతరం కొత్తకోట మున్సిపల్ కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని పరిశీలించి, ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, వీలైనంత త్వరగా ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఈ సమావేశంలో మదనపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ , సీడీసీ చైర్మన్ జి. చంద్రమోహన్ రెడ్డి , వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



అమీన్ పూర్ పోలీసులు అరెస్టు చేసిన ఏటీఎం సెంటర్ల వద్ద మోసం చేసే అంతర్ రాష్ట్రముఠా సభ్యులు..

# ఏటీఎం సెంటర్ల వద్ద జాగ్రత్త!

## ఆ ముఠా వస్తే కార్డు మాయం.. పిన్ నెంబర్ ఛేంజ్!

## వృద్ధులు, అమాయకులే టార్గెట్: 130 ఏటీఎం కార్డులతో అంతర్రాష్ట్ర కేటుగాళ్ల ముఠాను పట్టుకున్న అమీన్‌పూర్ పోలీసులు

**శేరిలింగంపల్లి : ఆగస్టు 3,(ప్రభాత ఉదయం)**

ఏటీఎం సెంటర్ల వద్ద డబ్బులు తీయడానికి వెళ్తున్నారా? అయితే కాస్త జాగ్రత్తగా ఉండండి! సాయం చేసే నెపంతో మీ ఏటీఎం కార్డును నొక్కేసి, క్షణాల్లో ఖాతా ఖాళీ చేసే ప్రమాదకర అంతర్రాష్ట్ర ముఠా ఒకటి పోలీసుల వలలో చిక్కింది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అమీన్‌పూర్ పోలీసులు పక్కా సమాచారంతో ఈ ముఠా రట్టు చేసి, ఆరుగురు సభ్యులను అరెస్ట్ చేసినట్లు శేరిలింగంపల్లి జోన్ డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. హర్యానా రాష్ట్రానికి చెందిన ఈ కేటుగాళ్లు ముఠాగా ఏర్పడి హైదరాబాద్‌కు వచ్చారు. నగరం నలుమూలలా ఉన్న నిర్మానుష్య ఏటీఎం సెంటర్ల వద్ద కాపు కాసేవారు. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన లేని అమాయకులు, ఏటీఎం మెషిన్ వాడకం సరిగ్గా తెలియని వృద్ధులను లక్ష్యంగా చేసుకునేవారు. బాధితులు డబ్బులు విత్ డ్రా చేసే క్రమంలో సాయం చేస్తున్నట్లు నటిస్తూ.. తెలివిగా వారి పిన్ నంబర్‌ను గమనించేవారు. మాటల్లో దించి, సెకన్ల వ్యవధిలో బాధితుడి కార్డును తమ వద్ద ఉన్న నకిలీ ఇతర కార్డుతో మార్చేసేవారు. బాధితుడు వెళ్ళిపోగానే దొంగిలించిన కార్డు, చూసిన పిన్ నెంబర్ ఉపయోగించి నగదు డ్రా చేయడం లేదా తమ వద్ద ఉన్న స్వైపింగ్ మెషిన్ల ద్వారా సొమ్మును తమ ఖాతాల్లోకి మళ్లించుకోవడం చేసేవారని డీసీపీ వివరించారు.

**స్వాధీనం చేసుకున్న సొత్తు**

అరెస్టయిన వారిని షహజాద్, అజ్రుద్దీన్, మహ్మద్ వసీం, సాకిబ్, ఎండీ అస్ఫాక్, మహ్మద్ జాఫర్‌లుగా పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న సోహైల్, ముబారక్ అనే మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. నిందితుల నుంచి వివిధ బ్యాంకుల సంబందించిన 130 ఏటీఎం కార్డులు, 2 స్వైపింగ్ మెషిన్లు, 3 ఆటోలు, 5 మొబైల్ ఫోన్లు 27,000 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

**పోలీసుల హెచ్చరిక -- ప్రజలకు సూచనలు**

అపరిచితుల సాయం కోర వద్దని ఏటీఎం కేంద్రాల్లో డబ్బులు తీసేటప్పుడు అపరి చితుల సాయం తీసుకోవద్దని చెప్పారు.

పిన్ నంబర్ రహస్యంగా ఉంచుకోవాలని, పిన్ నమోదు చేసేటప్పుడు కీప్యాడ్‌ను చేతితో కవర్ చేయాలని పక్కన ఎవరైనా ఉంటే ముందుకు వెళ్లవద్దని చెప్పారు. విత్ డ్రా పూర్తయ్యాక మీ చేతిలో ఉన్న ఏటీఎం కార్డు మీదేనా కాదా అని ఒకటికి రెండుసార్లు పేరు సరిచూసుకుకోవాలని అనుమానం వస్తే వెంటనే బ్యాంక్ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి కార్డును బ్లాక్ చేయించుకోవాలని లేదా 100 కు సమాచారం ఇవ్వాలని వివరించారు. నిందితులను అరెస్టు చేసిన ఆమీన్పూర్ పోలీసులను డిసిపి అభినందించారు.



# జూరాలకు పెరుగుతున్న వరద ఉధృతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం భారీగా పెరిగింది. సోమవారం సాయంత్రానికి జలాశయంలోకి 1.79 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. కర్ణాటక ప్రాజెక్టుల నుంచి కూడా దిగువకు నీటి విడుదల పెరిగింది. ఆలమట్టి జలాశయంలోకి 1.36 లక్షలు వస్తుండగా, దిగువకు 1.46 లక్షలు, నారాయణ్‌పూర్‌లోకి 1.40 లక్షలు వస్తుండగా దిగువకు 1.35 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. దీంతో పాటు భీమా నది నుంచి 65వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువలు విడుదల చేశారు. జూరాలకు ఎగువన ఆల్మటి జలాశయంలో 123.081 టీఎంసీలకు గాను 111.644 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, దిగువన ఉన్న నారాయణపూర్ జలాశయంలో 33.313 టీఎంసీలకు గాను 29.23 టీఎంసీల నీరు ఉంది. కర్ణాటక జలాశయాల నుంచి జూరాలకు భారీగా వరద వస్తుండటంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు 27 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సోమవారం సాయంత్రానికి జూరాలకు 1.79 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, 1.77 లక్షల క్యూసెక్కుల వరద దిగువకు వెళ్తున్నది. జూరాల 27 గేట్లు ఎత్తి దిగువకు 1,39,185 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 32,197 క్యూసెక్కులు, నెట్టెంపాడు లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్‌కు 1300 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ ఎత్తిపోతలకు 630 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.ఇక జూరాల ప్రాజెక్టు మొత్తం నీటిమట్టం 318.51 మీటర్లు కాగా ప్రస్తుతం 317.75 మీటర్లు ఉన్నది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలకు గాను ఇప్పుడు 8.126 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.



# గ్రామాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

## సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయండి

## పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం):పటాన్ చెరు, గుమ్మడిదల మండల పరిధిలోగల గ్రామాలలో ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సోమవారం సాయంత్రం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పటాన్చెరు, గుమ్మడిదల మండలాల పరిధిలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, పిఆర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులతో పాటు సిఎస్ఆర్ నిధులు కేటాయిస్తామని తెలిపారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో పరిష్కారానికి నోచుకోని సమస్యలను తన దృష్టికి తీసుకొని వస్తే.. పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నందిగామ గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తే. రాబోయే పది రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు. దీని ద్వారా ప్రతినెల గ్రామపంచాయతీకి ఆదాయం లభిస్తుందని తెలిపారు. భానూరు, క్యాసారం, నందిగామ గ్రామపంచాయతీల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని ఆదేశించారు. గుమ్మడిదల మండల పరిధిలోని అనంతరం, కానుకుంట, నూతనకల్, కొత్తపల్లి, తదితర గ్రామాల పరిధిలో అంతర్గత రహదారుల నిర్మాణానికి హ్యామ్ ద్వారా నిధులు మంజూరయ్యాయని.. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు డిఈ దీపక్ తెలిపారు. టెండర్లు పూర్తి చేసిన పనులు ప్రారంభించక పోతే సంబంధిత కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు యాదగిరి, ఉమాదేవి, పిఆర్ డిఈ దీపక్, ఎంపీఓ హరిశంకర్ గౌడ్, ఏఈ శశిధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# నార్సింగిలో 'చైన్ స్నాచింగ్' గుట్టు రట్టు: ఇద్దరు కేటుగాళ్ల అరెస్ట్!

## సాంకేతిక ఆధారాలతో నిందితులను పట్టుకున్న పోలీసులు.. రూ. లక్షల విలువైన బంగారం స్వాధీనం

**శేరిలింగంపల్లి : ఆగస్టు 3, (ప్రభాత ఉదయం)**




నార్సింగ్ పోలీసులు అరెస్టు చేసిన చైన్ స్నాచర్లు..

పగటిపూట నివాస ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు కేటుగాళ్ల ఆటను నార్సింగి పోలీసులు కట్టిచ్చారు. ఆల్కాపూర్ టౌన్‌షిప్‌లో సంచలనం సృష్టించిన చైన్ స్నాచింగ్ కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను అదుపులోకి తీసుకుని జైలుకు తరలించారు. ఈ కేసు వివరాలను శేరిలింగంపల్లి జోన్ డీసీపీ శ్రీనివాస్ వివరంగా వెల్లడించారు. ఇటీవల నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆల్కాపూర్ కాలనీలో ఓ మహిళ కాలినడకన తన గమ్యస్థానానికి వెళ్తోంది. సరిగ్గా అదే సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు అపరిచిత వ్యక్తులు, ఆ మహిళను అటకాయించి రెప్పపాటులో ఆమె మెడలోని బంగారు గొలుసును తెంచుకుని వేగంగా పరారయ్యారు. బాధిత మహిళ కేకలు వేసినప్పటికీ, నిందితులు క్షణాల్లో మాయమయ్యారు. దీనిపై బాధితురాలు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఘటన తీవ్రతను దృష్టిలో ఉంచుకుని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ ఉత్తర్వుల మేరకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలను కూలంకషంగా పరిశీలించిన పోలీసులు నిందితులను సూర్యతేజ (29), రాజా మోహన్ రెడ్డి (29)లుగా గుర్తించారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా తమ నేరాన్ని అంగీకరించారు.

**పాత నేరస్థులే..!**

అరెస్ట్ అయిన నిందితులకు నేర చరిత్ర ఉన్నట్లు డీసీపీ తెలిపారు. వీరిద్దరిపై గత ఏడాది డిసెంబర్‌లో రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బైక్ చోరీ కేసు కూడా నమోదైందని, జలసాల కోసం ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నారని విచారణలో తేలిందని డీసీపీ వివరించారు. అరెస్టయిన నిందితుల వద్ద నుంచి పోలీసులు చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. 20 గ్రాముల బంగారు గొలుసు, రెండు బంగారు పుస్తెలు, రెండు ఖరీదైన మొబైల్ ఫోన్లు నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొన్నట్లు వివరించారు. కేసును ఛేదించి నిందితులను త్వరగా పట్టుకున్న నార్సింగి సీఐ, ఎస్ఐ లతోపాటు ప్రత్యేక బృందాల సిబ్బందిని డీసీపీ శ్రీనివాస్ అభినందించారు. కాలనీల్లో ప్రజలు, ముఖ్యంగా ఒంటరిగా వెళ్లే మహిళలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# భూ భారతి ఆపరేటర్లకు వేతనాలు చెల్లించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**



భూ భారతి ప్రాజెక్ట్ కింద పనిచేస్తున్న 636 మంది ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ ఉద్యోగుల సేవలను 2026-27 ఆర్థిక సంవత్సరానికి రెన్యూవల్ చేయాలని మరియు గత 15 నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ భూ భారతి ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...జిల్లా కేంద్రంగా కలెక్టర్ కార్యాలయాల్లో, మండల కేంద్రంగా తహసీల్దార్ కార్యాలయాల్లో నిత్యం వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తూ భూ భారతి సేవలు అందిస్తున్న ఆపరేటర్లకు సకాలంలో వేతనాలు అందకపోడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. నెలనెలా ఇంటి ఖర్చులకు అప్పులు చేయాల్సి వస్తున్నదని మనోవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం తమను క్రమబద్ధీకరిస్తామని చెప్పి మాట తప్పడమే కాకుండా కనీసం వేతనాలను కూడా నెల నెలా ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి భూ భారతి ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ సేవలను పొడిగించాలి, 15 నెలల బకాయి జీతాలను వెంటనే చెల్లించాలి అని కోరారు.

# ప్రజావాణి ఆర్జీలను పెండింగ్‌లో ఉంచవద్దు

## రెవిన్యూ దరఖాస్తులను మండల స్థాయిలోనే పరిష్కరించాలి.

## ప్రజావాణికి 70 ఫిర్యాదులు.. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**



ప్రజావాణి ఆర్జీలను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్ లతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ వారం మొత్తం ప్రజల నుంచి 70 ఫిర్యాదులు వచ్చాయన్నారు. గత కొద్ది వారాలుగా వచ్చిన ప్రజావాణి ఆర్జీల పరిష్కారంలో చెప్పుకోదగ్గ పురోగతి ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కరించాల్సి ఉందన్నారు. జిల్లాతో పాటు సీఎం ప్రజావాణికి వచ్చిన ఆర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. మండల స్థాయిలో వచ్చిన ఫిర్యాదులను అక్కడే పరిష్కరించాలని, ముఖ్యంగా భూ సంబంధ సమస్యలపై వచ్చిన ఆర్జీలను సంబంధిత మండలాల రెవిన్యూ అధికారులు పరిష్కరిస్తే ప్రజలు ఇక్కడి వరకు రావాల్సిన అవసరం ఉండదన్నారు. గతంలో ప్రజావాణిలో ఇచ్చిన తమ ఫిర్యాదులు పరిష్కారం కాకపోవడంతో చాలామంది ప్రజలు అవే సమస్యలపై మళ్ళీ ప్రజావాణికి వస్తున్నారని, ఇలాంటి పరిస్థితులు ఉండరాదు అంటే సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో ఆర్జీలను పరిష్కరించాల్సి ఉందన్నారు. ఆయా శాఖల అధికారులు ప్రతి బుధవారం తమ సిబ్బందితో సమావేశాలు నిర్వహించుకొని తమ శాఖల పరిధిలో వచ్చిన ఆర్జీల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తుర్కోంపల్లిలో పట్టపగలే చోరీ

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3 ( ప్రభాత ఉదయం)**



గద్వాల మండలం తుర్కోంపల్లి గ్రామంలో పట్టపగలే చోరీ జరిగింది. సోమవారం ఉదయం తలారి నర్సింహులు ఇంటి తాళం పగలగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగలు రూ.30వేల నగదు, 5-6తులాల బంగారు, కొంత వెండి పట్టీలు దోచుకెళ్లారు. బాధితుల కథనం మేరకు నర్సింహులు తన భార్యతో కలిసి వైద్యం కోసం గద్వాల పట్టణానికి వెళ్లారు. వైద్య అనంతరం తిరిగి మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటికి చేరుకున్నారు. తాళం వేసిన ఉన్న తలుపులు తీసి ఉండటంతో దొంగతనం జరిగిందని ఆందోళనతో లోపలకు వెళ్లి చూసుకున్నారు. దుండగులు బీరువాను పగలగొట్టి అందులో భద్రపరిచిన 5-6 తులాలు బంగారు ఆభరణాలు, వెండీ పట్టీలు, రూ.30 వేలు నగదు పట్టుకుపోయారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, సిసిఎస్ ఎస్ఐ శేఖర్ సంఘటన స్థలాని పరిశీలించారు. క్లూస్‌టీమ్ ద్వారా వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.



# కొత్త రాజోలిలోనే ఎంఆర్ఓ ఆఫీస్ నిర్మించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3 (ప్రభాత ఉదయం)**

ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 2.25 కోట్ల నిధులతో నిర్మించనున్న రాజోలి మండల ఎమ్మార్వో కార్యాలయ భవనాన్ని వరద ప్రమాదం లేని "కొత్త రాజోలి" గ్రామంలోనే నిర్మించాలని కొత్త రాజోలి అఖిలపక్ష కమిటీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. 2009 సంవత్సరంలో వచ్చిన భారీ వరదలతో పాత రాజోలి గ్రామం పూర్తిగా మునిగిపోవడంతో అప్పటి ప్రభుత్వం 3,700 కుటుంబాలకు "కొత్త రాజోలి"లో స్థలాలు కేటాయించింది అని అన్నారు.కొత్త గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రి, సబ్-స్టేషన్ మొదలగు వాటి కొరకు దాదాపు 10 ఎకరాలకు పైగా భూమి ప్రత్యేకంగా కేటాయించబడింది అని, ప్రస్తుతం అక్కడ కస్తూర్బా పాఠశాల, ఉర్దూ పాఠశాల, ప్రైమరీ పాఠశాల, ప్రభుత్వ ఆసుపత్రి, కరెంట్ సబ్-స్టేషన్ తదితర భవనాలు నిర్మాణం పూర్తయి అందుబాటులో ఉన్నాయి అని భవిష్యత్ అవసరాలకు కూడా తగినంత స్థలం కేటాయించారని తహసీల్దార్, ఎంపీడిఓ, అగ్రి కల్చర్ , తదితర ఆఫీస్ భవనాలు నిర్మించుటకు అనువైన స్థలం ఉందన్నారు. పాత రాజోలి గ్రామం ప్రభుత్వ రికార్డులలో "ముంపు గ్రామం"గా నమోదైనప్పటికీ, ఇప్పటికీ అన్ని కార్యాలయాలు అక్కడే కొనసాగుతున్నాయి అని అన్నారు. గతంలో వరదల వల్ల గ్రామపంచాయతీ రికార్డులు, పాఠశాల విద్యార్థుల డేటా నష్టపోయిన ఘటనలు ఉన్నందున, పాత రాజోలిలోని కొందరి స్వార్థ రాజకీయాల వల్ల జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని కమిటీ కోరింది.కొత్త రాజోలిలో అందుబాటులో ఉన్న 2 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేసి, శాంక్షన్ అయిన రూ. 2.25 కోట్ల నిధులతో కొత్త రాజోలిలోనే వీ=ూ భవనాన్ని నిర్మించాలని, తద్వారా 11 గ్రామాల ప్రజలకు సురక్షితమైన ప్రాంతంలో ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉంటాయని, రికార్డులు కూడా భద్రంగా ఉంటాయని కమిటీ స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు పాల్గొన్నారు.